పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

## రంగడిని దర్శించుకున్న మంత్రి డోలా, ఎంపీ మాగుంట ఎమ్మెల్యేలు



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

రాచర్ల మండలం, జే.పి. చెరువు గ్రామ పంచాయితీ పరిధిలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సాంఘిక సంక్షేమ మంత్రి శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి , ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి , స్థానిక శాసనసభ్యులు, శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి , ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు , సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయకుమార్, స్థానిక నాయకులు శ్రీ కుప్పా రంగసాయి పలువురు నాయకులు. పాల్గొని కల్యాణం తిలకించారు.

# కమణీయం నెమలిగుండ్ల రంగడి కళ్యాణం

### కళ్యాణం తిలకించిన లక్షలాదిమంది భక్తులు

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల దంపతులు

### భక్తి శ్రద్ధలతో కళ్యాణం మహోత్సవం వీక్షించేలా ఎల్ ఈ డి స్క్రీన్‌ల ఏర్పాటు ఏర్పాటు









**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

రాచర్ల మండలం జె. పుల్లల చెరువు సమీపంలో నలమల్ల సోయగాల మధ్య ప్రకృతి ఒడిలో కొండ కోనల్లో స్వయంగా వెలసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవములు సందర్భంగా శుక్రవారం స్వామి వారి కళ్యాణం కమణీయంగా, వేద పండితులు నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి , ధర్మపత్ని పుష్పాలిలా స్వామి వారి కళ్యాణం మహోత్సవం లో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు , సమర్పించి రమణీయంగా, కంనీయంగా కళ్యాణం జరిపించారు వీరితో పాటుగా ఒంగోలు ఎమ్మెల్యే దామశీచర్ల జనార్దన్ ఆయన కుటుంబ సభ్యులు , వెల్ఫేర్ మినిస్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి , ఒంగోలుఎంపీ మాగుంట శ్రీనివాస రెడ్డి , కళ్యాణం మహోత్సవం లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీర్వాదం పొందారు . వేదపండితుల వేదమంత్రాల వల్లిస్తుండగా కళ్యాణ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది . స్వామివారికి శాస్త్రోక్తంగా ఆగమ శాస్త్రాల ప్రకారం జీలకర్ర బెల్లం, మాంగళ్య డి ధారణ , కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి , అమ్మవార్ల ప్రవరలను అర్చక స్వాములు ఆమోఘంగా చదివి భక్తుల ను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు.. స్వామివారి కళ్యాణ తిలకించేందుకు రాష్టం నలుమూలలనుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు కళ్యాణం వీక్షించేందుకు వీలుగా ఎల్ ఈ డి స్క్రీన్ ల ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల నొసంగారు. కల్యాణం కానీ వినిరుగాని రీతిలో నిర్వహించారు. భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా నాయకులకు అందరికీ శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు స్వామి వారి ప్రతిమ , తీర్థ ప్రసాదాలు అందించి ప్రతీ సంవత్సరం ఈ కళ్యాణ వేడుకలో పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే వేలాది మంది ప్రజలకు, భక్తులకు మునుపెన్నడూ లేని విధంగా స్వామి వారి దర్శనం కల్పించారు, ఎండలు ఎక్కువగా ఉంటాయని ముందే త్రాగు నీరు , మజ్జిగ , పందిర్లు, భోజన వసతులు అన్నీ ఏర్పాటు చేసి ఎవరు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కళ్యాణం వీక్షించేలా తగు సదుపాయాలు కల్పించమాన్నారు.

## రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో జిల్లా కలెక్టర్ విజయ సునీత





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

రాచర్ల మండలంలోని ప్రముఖ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత పాల్గొని స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఆలయ పరిసరాలను పరిశీలించి ఉత్సవాల ప్రత్యేకతను, ఆలయ చరిత్రను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం జరగబోయే తెప్పోత్సవ ఏర్పాట్లు సైతం ఆమె పరిశీలించారు. గుండంలో జరిగే ఈ తెప్పోత్సవాన్ని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, ఆలయ ఈవో నాగయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మోడీ పుష్కర కాలంలో పుష్కలంగా దేశాభివృద్ధి

### అమరావతి చట్టబద్ధత చారిత్రాత్మక అధ్యాయం.

### మోదీ చిత్రపటానికి పాలాభిషేకం -రాష్ట్ర బిజెపి మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఏప్రిల్ 3**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి పార్లమెంట్ చట్ట బద్ధత కల్పించడం రాష్ట్ర భవిష్యత్తుకు మేలైన శుభపరిణామమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శివసదన్ లో ధోర్నాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ పుష్కర కాలంలో దేశం పుష్కలంగా అభివృద్ధి వైపు శరవేగంగా పయనిస్తుందని అన్నారు. అమరావతికి చట్టబద్ధత తీసుకురావడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా మోదీ చేసిన సేవలకు గాను ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అమరావతి రాష్ట్ర అభివృద్ధికి కేంద్రబిందువుగా నిలుస్తుందని, ఇది ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు మరియు ఉద్యోగ అవకాశాలను తీసుకువస్తుందని ఆయన తెలిపారు. గత 12 సంవత్సరాల్లో మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగిందని కొనియాడారు. ఇక మార్కాపురం జిల్లా అభివృద్ధి విషయానికొస్తే, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రాంతానికి మరిన్ని మౌలిక సదుపాయాలు అందించాలని ఆయన కోరారు. ముఖ్యంగా మార్కాపురం జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ, కేంద్రీయ విద్యాలయాల స్థాపన, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా, మార్కాపురం నుంచి శ్రీశైలం వరకు రైల్వే సౌకర్యం కల్పించడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి దోహదం అవుతుందని, పర్యాటకం మరియు వ్యాపార రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే మార్కాపురం జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధతతో పాటు మార్కాపురం జిల్లాకు కేంద్ర ప్రోత్సాహం లభిస్తే, రాష్ట్రం మరియు ప్రాంతం రెండూ వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శులు జెవి నారాయణ, టి. అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దెల లక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు ఎస్.వీర రాఘవ రెడ్డి, తంగిరాల సీతారామిరెడ్డి,దాసరి అంకయ్య, ఎలకపాటి పోలయ్య, మండ్ల బాల కాశయ్య, మండ్ల వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఎస్సీ, ఎస్టీ గృహంపై సౌర కాంతులు

### మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్న “ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం” ద్వారా నిరుపేద వర్గాల ఇళ్లలో వెలుగులు నింపుతున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం గిద్దలూరు మండలంలోని కృష్ణంశెట్టి పల్లి గ్రామంలో ఎస్సీ/ఎస్టీ కాలనీల సౌరీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు పూర్తి ఉచితంగా సోలార్ ప్యానెల్స్‌ను అమర్చి, వారిపై విద్యుత్ భారం లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 74.06 కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 76.38 కోట్ల రూపాయల ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయ నన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో 24.69 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుందన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో 2,410 గృహాలను లబ్ధిదారులుగా గుర్తించి, 29.28 కోట్ల రూపాయల వ్యయంతో సౌరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. కృష్ణంశెట్టి పల్లి గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మొత్తం 319 సర్వీసులు ఉండగా, 179 మంది నమోదు చేసుకున్నారని, వీరిలో 111 సర్వీసులకు ప్రాథమికంగా ఆమోదం లభించిందని తెలిపారు. ఈ 111 సర్వీసుల కోసం 1.349 కోట్ల రూపాయల వ్యయంతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. దీనికి కేంద్రం 0.666 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 0.6829 కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తుదన్నారు. సౌర విద్యుత్ వినియోగం ద్వారా లబ్ధిదారులకు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయని, ఎటువంటి ఖర్చు లేకుండా సౌర విద్యుత్ వినియోగించుకోవచ్చని,కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పచ్చని పర్యావరణానికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ ఖర్చుల భారం తగ్గి, గృహ స్థాయిలో స్వయం సమృద్ధి లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ట్రూ అప్ చార్జెస్‌ను తగ్గించడం ద్వారా ప్రజలపై పడే అదనపు విద్యుత్ భారం తగ్గించిందని పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే కోరిక మేరకు ప్రతాప్ రెడ్డి కాలనీలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, కలెక్టర్ శ్రీమతి విజయ సునీత , యర్రగొండపాలెం నియోజక ఇంచార్జ్ ఎరిక్సన్ బాబు , జాయింట్ కలెక్టర పులి శ్రీనివాసులు , ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఏడీఈ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

### నూతన స్తంభాలు ఏర్పాటు -రోడ్డు పక్కన పాత స్తంభాలు

### తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

### ట్రాఫిక్ కు అంతరాయంగా పాత స్తంభాలు

**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

పట్టణంలోని పడమటి బలిజ పాలెం, రూరల్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు పాత స్తంభాలు తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. నూతన స్తంభాల ఏర్పాటుతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అయితే పాత స్తంభాలను రోడ్డు పక్కనే పడేయడంతో షాపులు ముందు పార్కింగ్, రోజువారి తోపుడుబండ్ల చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరు వ్యాపారులు తమ జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా



విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న పాత స్తంభాలను తీసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

# కొమరోలులో బాధాతప్త హృదయాలతోగుడ్ ఫ్రైడే వేడుకలు





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3**

కొమరోలు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో, బాధాతప్త హృదయాలతో జరుపుకున్నారు . మండలంలోని పలు గ్రామాల నుంచి క్రైస్తవ సోదరీ సోదరీమణులు శుక్రవారం ఉదయం గోపానిపల్లిలోని సి ఎస్ ఐచర్చి వద్దకు చేరారు . అక్కడి మందిరంలో చర్చి ఫాదర్ లు బైలా రమేష్ బీజేపీ జయానందం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థన అనంతరం చర్చి మత పెద్దలు ఆధ్వర్యంలో గోపానిపల్లి వద్ద నుంచి కొమరోలు లోని ఆర్.సి.యం చర్చి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చర్చి ఫాదర్ సిలువ మోస్తూ ర్యాలీ ముందు భాగంలో సాగగా, వందలాదిమంది క్రైస్తవ సోదర సోదరీమణులు చిన్నారులు శోక తప్త హృదయాలతో కీర్తనలు పాడుతూ ఆయన అనుసరిస్తూ ముందుకు సాగారు. దీనితో దాదాపు కిలోమీటర్ పొడవున క్రైస్తవుల ర్యాలీ కనిపించింది. అనంతరం ఆర్ సి ఎం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాల్లో క్రైస్తవులు పాల్గొన్నారు .ఆ సందర్భంగా చర్చి ఫాదర్ ఉదయరాజు గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరిస్తూ, యేసుక్రీస్తుకు సిలువ వేసిన రోజు. ఈస్టర్ సండే ముందుగా వచ్చేశుక్రవారం అని తెలిపారు. ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని స్మరించుకుంటూ క్రైస్తవులు అత్యంత బాధాతప్త హృదయాలతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే పవిత్ర దినం ఫ్రైడే అని పేర్కొన్నారు .మానవాళి పాప పరిహారార్థం క్రీస్తు చేసిన త్యాగానికి ,కరుణకు ఇది ప్రతీక అని పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే అని పురస్కరించుకొని క్రైస్తవులు గత 40 రోజులుగా చేపట్టిన ఉపవాసా దీక్షలు నేటితో ముగిశాయని అంటూ ఏసుప్రభు సిలువను మోసుకుంటూవెళ్లే దారిలో ఏర్పాటుచేసిన14 మజిలీలలో ఏసుప్రభువు సందేశాలు ఇచ్చారన్నారు.గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని కొమరోలు లోని ఆర్సిఎం చర్చిలో ప్రార్థన కార్యక్రమాలు జరిగాయి. క్రైస్తవులు పాడిన విషాద కీర్తనలతో చర్చి మార్మోగింది. మండలంలోని అన్ని ప్రధాన మందిరాలలో గుడ్ ఫ్రైడే వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. రెడ్డిచెర్లలోని ఆర్ సి ఎం చర్చిలో చర్చి ఫాదర్ బాల కిషోర్ ,తాటిచెర్లలోని ఆర్సిఎం చర్చిలో చర్చి ఫాదర్ బాలరాజు, బొద్దువాను పల్లె సిఎస్ఐ చర్చిలో చర్చి ఫాదర్ సతీష్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే కార్యక్రమాలు జరిగాయి.

# జై అమరావతి.. హర్షం వ్యక్తం చేసిన బిజెపి నేతలు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 3**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన సందర్భంగా మార్కాపురం జిల్లా బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మైనార్టీ మోర్చా బిజెపి మాజీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్, నేషనల్ వుమెన్ సెల్ వైస్ చైర్మన్ డాక్టర్ షేక్ షబానా మాట్లాడుతూ గత పాలకులు ఆంధ్రాకు అన్యాయం చేసినా కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసే దిశగా పయనిస్తూదని అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఆంధ్ర ప్రదేశ్ కు శాశ్వత రాజధాని అమరావతిగా చట్టబద్ధత పొందడం ఆంధ్ర ప్రజల అదృష్టమని అన్నారు. ఆంధ్ర రాష్ట్రం రాజధానికోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివి మాధవన్ లకు షేక్ షభాన, పీవీ కృష్ణారావు లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మహిళా నాయకులు శాసనాలు సరోజిని, కోటపాటి రాజా శ్రీకాంత్ గోళ్ళ సతీష్ వెంకట్ రెడ్డి శ్రీను బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ ఇన్చార్జి దద్దాలను కలిసిన దుగ్గిరెడ్డి జయరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 3**

గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై ఐకమత్యంగా వైయస్సార్సీపి బలోపేతం చేయాలని కనిగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించినట్లు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు మండలంలోని కోవిలంపాడు గ్రామమునకు చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ఎంపీటీసీ గోను సరస్వతి వెంకటేశ్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు దుగ్గిరెడ్డి రాము, కామాయపల్లి రాంబాబు, మస్తాన్ వైఎస్ఆర్సిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ కు కోవిలంపాడు గ్రామమునకు సంబంధించిన వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీల నియామక పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా దుగ్గిరెడ్డి జయరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం అంశాలపై ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, పార్టీ బలోపేతం చేయటంలో కార్యకర్త పాత్ర ఎంతో కీలకమని, కార్యకర్తలకే పార్టీకి బలమైన పునాదులని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ సూచించినట్లు తెలిపారు.

# ఖాజావలిని పరామర్శించిన టిడిపి నాయకులు

## ప్రమాద బాధితునికి 50 వేల ఆర్థిక సహాయం




**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 3**

మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన టిడిపి గ్రామ పార్టీ నాయకులు ఆనికాళ్లపల్లి ఖాజావలి గ్రామంలో ఇటీవల కరెంటు స్తంభాల మరమ్మతులు జరుగుతున్న సమయంలో స్తంభం అకస్మాత్తుగా అతని కాలు పై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి ఈ విషయం తెలుసుకున్న వెంటనే సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి శుక్రవారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మరియు గ్రామంలోని టిడిపి నాయకులు బాధితునికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. వైద్యశాలకు వెళ్లి మెరుగైన వైద్య చికిత్స చేయించుకోవాలని టిడిపి నాయకులు సూచించారు. టిడిపి పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని అన్నారు పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు చెరుకుపల్లి శ్రీనివాస్ రెడ్డి, చెరుకుపల్లి మల్లికార్జున్ రెడ్డి, చెరుకుపల్లి రమేష్ రెడ్డి, చెరుకుపల్లి నారాయణరెడ్డి, బేరి రమణారెడ్డి, డిస్కో మౌళి, రష్యా నారాయణ, దుగ్గిరెడ్డి శ్రీనాథ్, వెంకట రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

# నల్లగుంట్లలో మైనింగ్ సాకుతో బలవంతపు భూసేకరణను నిలిపివేయాలి

## మార్కాపురం జిల్లా సిపిఎం కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 3**

కొమరోలు మండలం నల్లగుంట్ల లో మైనింగ్ సాగుతో చేస్తున్న భూసేకరణ ను తక్షణమే నిలిపివేయాలని మార్కాపురం జిల్లా సిపిఎం కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య డిమాండ్ చేశారు. కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామ పొలాల్లో పలుగురాల్ల సేకరణ ప్రాసెస్ పేరుతో మైనింగ్ చేయుట కొరకు ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు అనుమతి ఇవ్వటం సమంజసం సమంజసం కాదని, సదరు ప్రైవేట్ కంపెనీల వ్యక్తులు 50 ఎకరాల వరకు భూమిలో పలుగురాయి సేకరించేందుకు మైనింగ్ కుసిద్ధమైందని ఆయన తెలిపారు. ఆ మేరకు ఈనెల రెండవ తేదీ ఆకస్మికంగా ప్రభుత్వ అధికారులు, పోలీసులను వెంటబెట్టుకొని వంద మందికి పైగా రైతుల పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు నల్లకుంట గ్రామానికి సంబంధంలేని వ్యక్తులతో నల్లగుంట్ల గ్రామంలోని ప్రవేశించారని ఆయన తెలిపారు. నల్లగుంట్ల గ్రామంలోని సర్వేనెంబర్ 351 లో 90 ఎకరాల పైగా భూమి ఉందని, సదరు భూమిలో 20 నుంచి 50 ఎకరాల పరిధిలో తెల్లరాయి ఉన్నదని ,సదరు తెల్లరాయిని మైనింగ్ చేసేందుకు 2023 సంవత్సరంలో ప్రభుత్వము తమకు మైనింగ్



చేసుకునేందుకు అనుమతులు ఇచ్చిందని ,అధికారుల ద్వారా ప్రైవేట్ కంపెనీల వ్యక్తులు గ్రామంలో ప్రచారం చేస్తూ ఉన్నారని ఆయన తెలిపారు. మైనింగ్ ప్రారంభించినట్లయితే రైతులు భూములు కోల్పోయి జీవనం దుర్భరంగా మారే అవకాశం ఉన్నదని, పశువులకు మేత కూడా లభించక పశువులను అమ్ముకోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. కావున రైతులు, పశుపోషకుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# అందరు ప్రేమాభిమానాలతో కలిసి జీవించాలి...

## పాస్టర్ ఆర్ ఆనందరావు





**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 3**

పుల్లల చెరువు మండలంలో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి.యేసుక్రీస్తు సిలువపై చేసిన మహత్యాగాన్ని స్మరించుకుంటూ మండలంలోని పలు చర్చిల్లో విశేష ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే చర్చిలకు చేరుకున్న భక్తులు ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.యేసుక్రీస్తు శ్రమలు, సిలువ మార్గంలో ఆయన ఎదుర్కొన్న బాధలను స్మరించుకుంటూ విశ్వాసులు మౌనంగా ప్రార్థనలు చేశారు. కీర్తనలు ఆలపిస్తూ భక్తులు ఆరాధనలో పాల్గొని తమ భక్తి భావాన్ని వ్యక్తపరిచారు.అదేవిధంగా యేసు నామకరణ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు ఆధ్యాత్మికంగా సాగాయి.ఈ సందర్భంగా పాస్టర్ ఆర్. ఆనందరావు సందేశం ఇస్తూ యేసు ప్రభువు జీవితం మానవాళికి మార్గదర్శకమని అన్నారు. ప్రేమ, కరుణ, క్షమ, సహనం, త్యాగం వంటి మహత్తర విలువలను యేసుక్రీస్తు తన జీవితం ద్వారా ప్రపంచానికి బోధించారని తెలిపారు. శత్రువులను సైతం ప్రేమించాలి, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలి అనే ఆయన బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.గుడ్ ఫ్రైడే సందేశం కేవలం ఆరాధనకు పరిమితం కాకుండా, మన జీవిత విధానాన్ని మారుస్తుందనే అంశాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. సమాజంలో పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందించుకోవడం, అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం ద్వారా యేసు బోధించిన మార్గాన్ని అనుసరించవచ్చని పేర్కొన్నారు.చర్చిల పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొని, యేసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ విశ్వాసులు ఆత్మపరిశీలనలో నిమగ్నమయ్యారు.ఈ కార్యక్రమాల్లో సంఘ పెద్దలు, సంఘస్తులు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయంలో దరఖాస్తుల ఆహ్వానం




**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 3**

2026-27 విద్యా సంవత్సరానికి గాను కందుకూరు పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో 2వ తరగతి, ఆపై తరగతులలో ప్రవేశాల కొరకు ఆఫ్లైన్ రిజిస్ట్రేషన్ 2.04.2026 (గురువారం) ఉదయం 9 గంటల నుండి 08.04.2026 ళిబుధవారంరి సాయంత్రం 04:00 గంటల వరకు జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. 2వ తరగతి ఆపై తరగతులకు రిజిస్ట్రేషన్ (ఆఫ్లైన్ విధానంలో) 02.04.2026 నుండి 08.04.2026 వరకు (పని దినాలలో మాత్రమే) ఒక నిర్దిష్ట తరగతిలో ఖాళీల లభ్యతకు లోబడి ఉంటుంది అని తెలిపారు. రెండో తరగతిలో 3 సీట్లు, మూడో తరగతిలో 40 సీట్లు, నాలుగో తరగతిలో 42 సీట్లు, ఐదో తరగతిలో 42 సీట్లు, ఏడో తరగతిలో 4 సీట్లు, తొమ్మిదో తరగతిలో 4 సీట్లు, 10వ తరగతిలో 22 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. మొత్తం 157 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఆసక్తి కలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# నేడు అద్దంకిలో డాక్టర్ అశోక్ కుమార్ పర్యటన

## తిరుమల పవిత్రతను కాపాడాలి

## టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును తొలగించాలి



**అద్దంకి ఆర్సి ఇన్చార్జ్(పెన్ పవర్) ఏప్రిల్ 3**

అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్ శనివారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం ఉదయం 10:00 గంటలకు అద్దంకి మండలం, సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానాన్ని అశోక్ కుమార్ సందర్శిస్తారు. తిరుమల పవిత్రతను కాపాడాలని, టీటీడీ చైర్మన్ పదవి నుండి బి.ఆర్. నాయుడును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అద్దంకిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఐదు మండలాలకు చెందిన సర్పంచ్ల పదవీ విరమణ సన్మాన సభలో పాల్గొని, సేవలు అందించిన సర్పంచ్లను ఘనంగా సన్మానించనున్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పార్టీ వర్గాలు కోరాయి.

# కాకర్ల గ్రామంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 3**

మండలంలోని కాకర్ల గ్రామంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల తెలుగు బాప్తి చర్చ్ నందు గుడ్ ఫ్రైడే ను ఘనంగా నిర్వహించారు. సమీపంలో ఉన్న పులికొండ పై ఉన్న సిలువకు భక్తులు చేరుకొని అక్కడ ఏసుప్రభువు శిలువలో పడిన శ్రమలను గురించి మరియు ఏడు మాటలు గురించి ధ్యానం చేయడం జరిగింది. నేటితో 40 దినముల ఉపవాస దినాలు ముగింపు చేయడము జరిగింది. శిలువ యాత్రలో భాగంగా పాస్టర్ ప్రసన్నకుమార్ మరియు సిలువ మోసిన వ్యక్తి కుందా యేసేపు భక్తులు సంఘ పెద్దలు వారితోపాటు కమిటీ ప్రెసిడెంట్ సెక్రటరీ ట్రెజరర్ కుమారు శేఖరు దివాకరు ఇశ్రాయిల్ పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ తదుపరి చర్చిలో పాస్టర్ గారు గుడ్ ఫ్రైడే గురించి బోధ చేశారు. తరువాత భోజనం కార్యక్రమాలు బైబిల్ క్విజ్ నిర్వహించడం జరిగింది.

